

ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

● జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి కార్పొరేటర్ వినతి

వనస్థలిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. ఈ మేరకు గురువారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మన్సూరాబాద్ డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేసి, డివిజన్ అభివృద్ధికి తోడ్పాటును అందజేయాలన్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని కమిషనర్ తెలిపినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

డివిజన్ సమస్యల పరిష్కారానికి సహకరించండి

కొత్తపేట : కొత్తపేట డివిజన్ సమస్యల పరిష్కారానికి సహకరించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి కార్పొరేటర్ పవన్‌కుమార్ విన్నవించారు. గురువారం ఆయన కమిషనర్‌ను కలిసి సమావేశమయ్యారు. గాయత్రీపురం, నాగేశ్వర్ నగర్, ఎస్‌ఆర్‌ఎల్‌కాలనీ, బృందావన్ కాలనీల మీదుగా చేపట్టిన బాక్స్‌డ్రెయిన్ పనులు అర్థాంతరంగా ఆగిపోయాయని, పనుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాఘవేంద్రనగర్‌కాలనీ, న్యూనాగోల్ కాలనీల్లో చేపట్టాల్సిన ఆర్‌సీసీ పైప్‌లైన్ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న పారిజాతారెడ్డి

సరూర్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ 22వ డివిజన్‌లోని సాయిప్రభ హోమ్స్, శివనారాయణపురం కాలనీల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు గురువారం కార్పొరేటర్ లిక్కి మమతాకృష్ణారెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులను మరింత వేగంగా చేపట్టనున్నట్టు తెలిపారు. అనంతరం ఆయా కాలనీల్లో స్వచ్ఛదనం-పచ్చదనం ర్యాలీని ప్రారంభించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, ఏఈ బిక్కూనాయక్, నాయకులు లిక్కి కృష్ణారెడ్డి, గట్టు బాలకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు..



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

దిల్‌సుఖ్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా జాగ్రత్తలు తీసుకోవాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్తా అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలోని ప్రభాత్‌నగర్, హనుమాన్‌నగర్ కాలనీల్లో అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో ఎలాంటి సమస్య తలెత్తినా తక్షణమే పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాసులు, డీఈ విజయ్, ఏఈ పార్వతి, బీజేపీ నాయకులు వినోద్‌యాదవ్, నరేందర్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్..



కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ శ్రీపురంకాలనీ ఫేజ్-2లో కాలనీవాసులు సొంత నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొంత నిధులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించుకోవడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కాలనీ గౌరవ అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విఠల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు సికిందర్‌రెడ్డి, కోశాధికారి జంగయ్యగౌడ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి నర్సింహారెడ్డి, సలహాదారులు విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

నాలా నిర్మాణ పనుల పరిశీలన



పోచమ్మగడ్డలో నాలా నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతానాయక్

చంపాపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని ఆయా కాలనీ, బస్తీల్లో డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా సత్వర చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ సుజాతా నాయక్ అన్నారు. సాగర్ ఎన్‌క్లేవ్‌కాలనీ, పోచమ్మగడ్డలో సీఆర్‌ఎంపీ నిధులతో చేపట్టిన నాలా నిర్మాణ పనులను గురువారం ఏఈ హేమునాయక్‌తో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైనేజీల్లో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టాలని, వర్షాలకు డ్రైనేజీలు పొంగిపొర్లకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సుదర్శన హోమం

చంపాపేట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని పోచమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం సుదర్శన హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చాముండేశ్వరీ గురుదత్తపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ కొడకండ్ల శ్రీరామశరణ్‌శర్మ గురూజీ నేతృత్వంలో గణపతి పూజ, ప్రాతఃకాల పూజలు, రుద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఎరుకల విశ్వనాథ్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన పూజా కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ

చాదర్‌ఘాట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఓల్డ్‌మలక్‌పేటలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గల శివాలయం పక్కన నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ వీ.రాంకోటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ప్రతిష్ఠ కార్యక్రమంలో ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్ పటేల్, ఆలయ కమిటీ ట్రస్టీలు, చేగిరెడ్డి మదన్, ద్వారక, ముప్పిడి శ్రీనివాస్, బాబు శ్రీనివాస్, చీపురు రాజారావుగౌడ్ పాల్గొన్నారు. శుక్రవారం నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లెలగూడలో తల్లిపాల వారోత్సవాలు

సరూర్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ 43వ డివిజన్‌లో గల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన ర్యాలీని కార్పొరేటర్ గజ్జల రాంచందర్ ప్రారంభించి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు తమ ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పుట్టిన పిల్లలకు తప్పనిసరిగా తల్లిపాలు తాగించాలని అన్నారు. అనంతరం వారికి పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శోభారాణి, అరుణ, రజిత, అండాలు, సుజాత, ఆర్పీలు కవిత, శోభారాణి, మహేశ్వరి పాల్గొన్నారు.

జాగ్రత్తలతో వైరల్ జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చు

వనస్థలిపురం: జాగ్రత్తలతో వైరల్ జ్వరాల నుంచి రక్షణ పొందవచ్చని కామినేని వైద్యులు శ్రీకృష్ణ అన్నారు. గురువారం ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైరల్ జర్వాల నుంచి రక్షణ ఎలా పొందవచ్చు, తగిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బయటకు వెళ్లి వచ్చిన వెంటనే చేతులను సబ్బుతో కడుకోవాలని సూచించారు. ఇంట్లో వైరల్ ఫీవర్ ఒకరికి వస్తే అది అందరికీ వచ్చే అవకాశం ఉందన్నారు. వైరల్ జ్వరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.



గుంటి జంగయ్యనగర్‌కాలనీలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏఈ ప్రజ్ఞ తదితరులు



మన్సూరాబాద్ డివిజన్ అగమయ్యనగర్‌కాలనీలో మట్టి పూడికతీత పనులు పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి, డీసీ యాదయ్య తదితరులు



నాగోల్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్, మున్సిపల్ అధికారులు

వాడవాడలా 'స్వచ్ఛదనం-పచ్చదనం'

వనస్థలిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమాన్ని వనస్థలిపురం, మన్సూరాబాద్, నాగోల్, లింగోజిగూడ డివిజన్లలో వాడవాడలా నిర్వహించారు. ఈ సందర్భంగా నాలాల్లో పేరుకపోయిన చెత్త, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించారు. కాలనీలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధుల నివారణకు కాలనీవాసులు కృషి చేయాలని పలువురు కార్పొరేటర్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణాసురేందర్‌యాదవ్, దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, డీసీ తిప్పర్తి యాదయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందికి మొక్కలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మీరెడ్డి

చాదర్‌ఘాట్ : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి విజ్ఞప్తి చేశారు. గురువారం మూసారాంబాగ్ డివిజన్‌లోని శాలివాహననగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె వైద్యాధికారి డాక్టర్ తరుణ్‌తోపాటు వైద్య సిబ్బందికి మొక్కలు పంపిణీ చేశారు. అంతకుముందు ఆరోగ్య కేంద్రం ఆవరణను పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మూసారాంబాగ్ డివిజన్ స్వచ్ఛదనం, పచ్చదనం నోడల్ అధికారి ఏఎంసీ మురళి, యూబీడీ సూపర్‌వైజర్ కృష్ణ, వైద్యాధికారి డాక్టర్ తరుణ్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ గున్నప్ప, ఎస్‌ఎఫ్‌ఏ ముజీబ్, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, సందీప్, మధు, నరేందర్, సంతోష్ పాల్గొన్నారు.

పరిసరాల పారిశుధ్యంపై ప్రజలు దృష్టిపెట్టాలి

కొత్తపేట : పరిసరాల పారిశుధ్యంపై కాలనీల ప్రజలు దృష్టి పెట్టాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ సూచించారు. గురువారం న్యూనాగోల్‌లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పాల్గొన్నారు. చెత్తా, వ్యర్థాలను దారులపై పడేయవద్దని కాలనీవాసులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పోచంపల్లి రాజేందర్‌రెడ్డి(పీఎంఆర్ రాజు), ప్రధాన కార్యదర్శి మోహన్‌రాజు, మహిళా మోర్చా నాయకురాలు నందికొండ గీతారెడ్డి, ఈఈ శ్రీనివాస్, డీఈ నవీన్‌కుమార్, ఏఈ మాత్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



న్యూనాగోల్‌లో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో కార్పొరేటర్ పవన్‌కుమార్, జీహెచ్‌ఎంసీ అధికారులు

నాలాల్లో నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలి

సంతోష్‌నగర్ : డివిజన్‌లోని ఆయా కాలనీల్లో ఉన్న నాలాల్లో పూడికతీత పనులు చేపట్టి నీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు చేపట్టాలని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అధికారులను కోరారు. చంపాపేట డివిజన్ రాజిరెడ్డికాలనీలో గురువారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కాలనీల్లో అధికారులతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా, ఈఈ కార్తీక్, శానిటేషన్ డీఈ వెంకటేశ్, ఇంజనీరింగ్ డీఈ రఫీక్, ఏఈ సురేష్, జలమండలి మేనేజర్ రమ్యభారతి, కాలనీ ఆధ్యక్షుడు క్రాంతికుమార్ పాల్గొన్నారు.

న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులను కఠినంగా శిక్షించాలి

● హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్

హయత్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జనగాంలో ఇద్దరు న్యాయవాదులపై పోలీసులు చేసిన దాడిని నిరసిస్తూ గురువారం హయత్‌నగర్‌లో కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నల్లబ్యాడ్జీలు ధరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. హయత్‌నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు దాడికి పాల్పడిన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కోర్టు నుంచి విజయవాడ జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. జరిగిన ఘటనపై ఎస్పీ స్థాయి అధికారి చేత విచారణ జరిపించాలని భిక్షపతిగౌడ్ డిమాండ్ చేశారు. భవిష్యత్తులో న్యాయవాదులపైన దాడులు జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాన్ని తీసుకురావాలని కోరారు. బాధ్యులైన పోలీసులను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్‌గౌడ్, సీనియర్ న్యాయవాది రామ్మోహన్‌తో పాటు పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



హయత్‌నగర్ కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రంగారెడ్డి జిల్లా న్యాయవాదుల ఆందోళన

రంగారెడ్డిజిల్లా కోర్టులు : జనగాంలో మూడు రోజుల క్రితం న్యాయవాద దంపతులపై పోలీసులు దాడికి పాల్పడడాన్ని నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు. న్యాయవాదులు కోర్టు భవనాల సముదాయం నుంచి ర్యాలీగా వెళ్లి జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో తీవ్ర ట్రాఫిక్ రద్దీ నెలకొని, వాహనాలు స్తంభించిపోయినవి. దాడికి పాల్పడిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేసి, చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వెంటనే న్యాయవాదుల ప్రొటెక్షన్ యాక్టును అమలు చేయాలని నినదించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణ, సీనియర్ న్యాయవాదులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి, విప్లవరెడ్డి పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేస్తున్న న్యాయవాదులు



మిధానీ ఆర్టీసీ డిపోను సందర్శిస్తున్న ఈడీ వెంకటేశ్వర్లు

మిధానీ డిపోని సందర్శించిన ఈడీ

సంతోష్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్‌లోని మిధానీ ఆర్టీసీ డిపోను గురువారం జీహెచ్2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వీ. వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. లక్ష్యే లక్ష్యం కోసం ఉద్యోగులు పని చేయాలని ఆయన సూచించారు. ఉద్యోగులకు ఆయన పలు సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం జగన్, సచరిత, డిప్యూటీ సీటీఎం శ్రీనివాస్, డీఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

205 రూట్‌లో కాచిగూడ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్‌కు 4 బస్సులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో కొత్తగా 205రూట్‌లో కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్‌కు 4 ప్రత్యేక బస్సులు శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు తెలిపారు. కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి మొదటి బస్సు ఉదయం 6.10, చివరి బస్సు రాత్రి 8.40 నిమిషాలకు, అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి మొదటి బస్సు ఉదయం 7.20, చివరి బస్సు రాత్రి 7.50 నిమిషాలకు ఉంటుందన్నారు. కాచిగూడ డిపోకు చెందిన నాలుగు బస్సులు కాచిగూడ స్టేషన్ నుంచి జైల్ గార్డెన్, సూపర్‌బజార్, దిల్‌సుఖ్‌నగర్, ద్వారకానగర్, ఎల్‌బీనగర్ ఎక్స్‌రోడ్, పనామా, భాగ్యలత, హైదర్‌నగర్, ఎల్‌ఆర్‌పాలెం, పెద్దఅంబర్‌పేట, ఔటర్‌రింగ్‌రోడ్, అబ్దుల్లాపూర్‌మెట్ రూట్లలో నడుస్తున్నాయని ఈ సేవలు విద్యార్థులు, ప్రయాణికులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'ఎంవీఎస్ఆర్'లో ఘనంగా ప్రారంభమైన 'అథ్లెమా-2024'

సరూర్‌నగర్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు 'అథ్లెమా-2024' పేరుతో జరుగనున్న రాష్ట్రస్థాయి అంతర్ కళాశాలల క్రీడల పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రముఖ కంబాట్ క్రీడాకారిణి, అంతర్జాతీయ అవార్డు గ్రహీత తక్కడపల్లి ప్రతిభ హాజరై ఈపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనది గ్రామీణ ప్రాంతమని, క్రీడల్లో శిక్షణ సరిగా లేని రోజుల్లోనూ ఎంతో కష్టపడి అంతర్జాతీయ స్థాయికి ఎదిగానని, ప్రస్తుతం కాలేజీల్లో అధునాతన శిక్షణ అవకాశాలు అందుబాటులో ఉన్నందున విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించుకుని తనకన్నా ఎత్తుకు ఎదగాలని సూచించారు. కళాశాల కల్చరల్ విభాగం అధ్యక్షురాలు హిరణ్మయి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించి విద్యార్థులకు సరైన తర్ఫీదు ఇవ్వడానికిగాను తమ కళాశాలలో అన్ని సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాతృశ్రీ విద్యా సంస్థల సభ్యులు సాగరిక, ఉమాదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. అథ్లెమా-24లో భాగంగా క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, త్రోబాల్, బ్యాడ్మింటన్ తదితర అవుట్‌డోర్ క్రీడలతో పాటు టేబుల్ టెన్నిస్, చెస్, క్యారమ్స్ తదితర ఇండోర్ గేమ్స్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.



ఎంవీఎస్ఆర్ కాలేజీలో క్రీడల పోటీలను ప్రారంభిస్తున్న ప్రముఖ క్రీడాకారిణి ప్రతిభ

ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా మధు



అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఆర్‌ఎన్‌ఆర్ కాలనీకి చెందిన తైలి మధు నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జరిగిన ఏఐవైఎఫ్ జిల్లా నిర్మాణ మహాసభలో జిల్లా అధ్యక్షుడిగా మధును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యువత సమస్యలపై పోరాటం చేస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించిన నిర్మాణ బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

బ్రెయిన్ డెడ్ మహిళ అవయవదానం



శోభారాణి(ఫైల్)

చంపాపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ క్రాంతినగర్‌కు చెందిన కటకం శోభారాణి ఈ నెల 4వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురైంది. దీంతో ఆమెను ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. కాగా పరీక్షించిన వైద్యులు ఆమె బ్రెయిన్ డెడ్ అయిందని కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో శోభారాణి కుటుంబ సభ్యులు ఆమె అవయవాలు దానం చేసేందుకు ముందుకు వచ్చారు. బుధవారం ఆమె అవయవాలను దానం చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మీర్‌పేట్‌లో పీవైఎల్ బస్తీబాట



సమస్యలు తెలుసుకుంటున్న పీవైఎల్ ప్రతినిధులు

సరూర్‌నగర్: బస్తీలు, మురికివాడల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునే నిమిత్తం ప్రోగ్రెసివ్ యూత్ లీగ్(పీవైఎల్) ఆధ్వర్యంలో చేపట్టిన బస్తీబాటలో భాగంగా గురువారం పీవైఎల్ బాలాపూర్ కమిటీ ప్రతినిధులు బాలాపూర్ చౌరస్తా, లెనిన్‌నగర్, హుడాకాలనీ, ప్రశాంత్‌నగర్ తదితర బస్తీల్లో పర్యటించారు. స్థానికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ఎక్కువగా బస్తీల ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నట్టు వెల్లడి కావడంతో.. సీజనల్ వ్యాధులను అరికట్టడానికి అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని పీవైఎల్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీవైఎల్ బాలాపూర్ కమిటీ అధ్యక్షుడు కోరెమొల్ల రాకేశ్, ప్రధాన కార్యదర్శి కొల్లూరు భీమేశ్, ప్రతినిధులు కొల్లూరు శంకర్, జి.మహేశ్, ఆకాశ్, ప్రవీణ్, నరేందర్ పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీమ్స్ లక్ష్యం : సీపీ

● 15 రోజుల్లో 138 మంది పోకిరీలను పట్టుకున్న రాచకొండ షీ టీమ్స్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, బాధితులు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని రాచకొండ సీపీ జీ.సుధీర్‌బాబు తెలిపారు. బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్లు, మెట్రోస్టేషన్లు, స్కూళ్లు, కాలేజీలు, కూరగాయల మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలలో మఫ్టీలో తిరుగుతూ షీ టీమ్స్ డెకాయ్ ఆపరేషన్లు చేస్తున్నారని, బాలికలను, మహిళలను వెంబడించే, వేధించే పోకిరీల చేష్టలను సాక్ష్యాధారాలతో సహా పట్టుకొని న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నామన్నారు. గడిచిన 15 రోజుల్లో 138 మంది పోకిరీలను (70మంది మైనర్లు) పట్టుకుని ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయంలో గురువారం తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించామన్నారు. కేసు తీవ్రతను బట్టి 14 మందిపై క్రిమినల్ కేసులు, 54 మందిపై పెట్టీ కేసులు, 81 మందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రేమ పేరుతో వేధించి, ఫొటోలను సోషల్‌మీడియాలో పోస్ట్ చేసిన వ్యక్తిపై, మహిళను వేధిస్తున్న మాజీ భర్తపై, యజమాని కుమార్తె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై, మైనర్ బాలికను ప్రేమ పేరుతో వేధించిన యువకుడిపై కేసులు నమోదు చేశామని ఉమెన్ సేఫ్టీ వింగ్ డీసీపీ టీ. ఉషా విశ్వనాథ్ తెలిపారు. కమిషనరేట్ పరిధిలో 50 అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.

పందులను దొంగిలిస్తున్న వ్యక్తి అరెస్టు

● పరారీలో మరో ఇద్దరు

అబ్దుల్లాపూర్‌మెట్: గుట్టుచప్పుడు కాకుండా రాత్రిపూట షెడ్డులో నుంచి పందులను దొంగిలిస్తున్న వ్యక్తిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. అతడికి సహకరించిన మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారానికి చెందిన కూతాడి విక్రమ్ పందుల పెంపకందారుడు. ఇతడు పెద్దఅంబర్‌పేట్ పరిధిలోని సర్వే నంబర్ 244/95, 96లో షెడ్డును వేసి పందులను పెంచుతున్నాడు. కాగా ఈనెల 3న పందులను షెడ్డులోకి తోలి ఇంటికి వెళ్లాడు. తిరిగి మరుసటి రోజు ఉదయం 6గంటలకు షెడ్డుకు వచ్చాడు. షెడ్డులో 10 పందులు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన అతడు వాటి కోసం చుట్టు పక్కల ప్రాంతాల్లో వెతికాడు. పందులు ఎక్కడ కనిపించకపోవడంతో బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు సమీపంలో పందులను ఓ వ్యాన్‌లో తీసుకెళ్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కొత్తపేటకు చెందిన పందుల వ్యాపారి తేరాసింగ్ పందులను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. గురువారం కొత్తపేటకు వెళ్లిన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు తేరాసింగ్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతడికి మరో ఇద్దరు సహకరించినట్లు తెలిసింది. ప్రస్తుతం వారు పరారీలో ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తులపై కేసు

కొత్తపేట, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ కాలేజీలో సీటు ఇప్పిస్తామని తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వమంటే కులం పేరుతో దూషించిన వ్యక్తులపై నాగోల్ పోలీసులు కేసు నమోదు చేశారు. మీర్‌పేట శ్రీద్వారకామయి కాలనీలో ఉండే వంగేటి స్రవంతి న్యాయవాది. నాగోల్ ఆనంద్‌నగర్‌లో ఉండే కత్తి జస్వంత్ అలియాస్ బ్లూ కార్పొరేట్ కాలేజీల్లో సీట్లు ఇప్పిస్తుంటాడని భర్త ద్వారా ఆమెకు తెలిసింది. కాగా, తమ కుమారుడికి ఘట్‌కేసర్ నారాయణకాలేజీలో సీటు కావాలని స్రవంతిని ఆమె స్నేహితురాలు ప్రేమలత సంప్రదించింది. తర్వాత జస్వంత్‌కు సమాచారం ఇచ్చారు. గతేడాది మొదట ప్రేమలత అతడికి రూ.80వేలు ఫోన్‌పేద్వారా పంపింది. తర్వాత స్రవంతి ద్వారా మరో రూ.20వేలు కూడా అతడికి అందజేసింది. విషయం తెలిసిన స్రవంతి సోదరుడు కూడా అదే కాలేజీలో సీటు కావాలని రూ.40 జస్వంత్‌కు ఇచ్చాడు. కాలేజీలో సీటు ఇప్పించకపోవడంతో తాము చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని బాధితులు 3నెలల క్రితం ఆనంద్‌నగర్‌కు వెళ్లి జస్వంత్‌ను అడిగితే అతడు, అతడి తల్లి వాణి వారిని కులం పేరుతో దూషించారు. ఈ నెల 6వ తేదీన మరో మారు బాధితులు ఆనంద్‌నగర్‌లో అతడిని అడిగారు. మళ్లీ వారిని అతడు బెదిరించి, దుర్భాషలాడాడు. దీంతో బాధితులు నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం హయత్‌నగర్‌లోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు నర్సింహ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, పీఆర్‌సీకి అర్హులైన వారిని గుర్తించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంజయ్య, చంద్రయ్య, హంసమ్మ, మల్లయ్య పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగ-తిరంగ యాత్రను జయప్రదం చేయండి : రంగారెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): త్రివర్ణ పతాకం గొప్పతనాన్ని ఇనుమడింప చేయడానికి నిర్వహించే హర్ ఘర్ తిరంగ-తిరంగ యాత్ర శుక్రవారం ఉదయం బీఎన్ రెడ్డినగర్‌లోని తెలంగాణ చౌరస్తా నుంచి వనస్థలిపురం రైతుబజార్ వరకు 75మీటర్ల జాతీయ జెండా ర్యాలీని జయప్రదం చేయాలని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఎల్బీనగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో హర్ ఘర్ తిరంగ-తిరంగ యాత్ర కార్యక్రమాలను సామ రంగారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, నాయికోటి పవన్‌కుమార్, నాయకులు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, నాంపల్లి రామేశ్వర్, గీతారెడ్డి పాల్గొన్నారు.

భార్యను గాయపర్చిన భర్తకు జైలు



రమేష్

సైదాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): తాగిన మత్తులో భార్యను గాయపర్చిన కేసులో భర్తకు నాంపల్లి కోర్టు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ కథనం ప్రకారం సింగరేణికాలనీలో నివాసముండే రమేష్‌తో రేణుకకు పదకొండు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరిద్దరికి ఇద్దరు సంతానం. కొద్ది నెలలుగా రమేష్ తాగుడుకు బానిసై భార్య, పిల్లలను వేధించసాగాడు. ఈనెల 2న సాయంత్రం మద్యం మత్తులో వచ్చి భార్యపై దాడి చేయడంతో ఆమెకు గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో భర్తనే పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. నిందితుడికి ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారు.